క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



తెనాలిఅర్బన్: శ్రీ చక్ర సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.మిథునేశ్వర్‌రెడ్డి ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కమ్మెల హరీష్ మాట్లాడుతూ వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ మిథునేశ్వర్‌రెడ్డి పలువురికి ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించారని, సాధారణంగా ఈ పరీక్షకు రూ.1,100 అవుతుందని, తమ హాస్పిటల్‌లో 325 మందికి ఉచితంగా చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కమ్మెల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత



తెనాలిరూరల్: హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులు, హాస్టల్ నిర్వాహకులకు గురువారం అప్పగించారు. తెనాలి మండలం అంగలకుదురులోని ముక్తి హాస్టల్‌లో నాలుగో తరగతి చదువుతున్న బాలుడు ఈ నెల 13న హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. హాస్టల్ నిర్వాహకులు, తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా రూరల్ పోలీసులు బాలుడి కోసం వెతుకులాట ప్రారంభించారు. కృష్ణా జిల్లా ఆగిరిపల్లిలో నాయనమ్మ, తాతయ్య దగ్గరకు వెళ్లినట్టు తెలుసుకుని బాలుడిని తెనాలి రప్పించారు. తల్లిదండ్రులు, హాస్టల్ నిర్వాహకులకు రూరల్ ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు బాలుడిని అప్పగించారు.

మిమిక్రీ కళాకారుడు చిరంజీవికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం జయం మనదే చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం తిరుపతమ్మ కథ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ మిమిక్రీ కళాకారుడు బీసిపోగు చిరంజీవిని సన్మానించారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, గు మ్మడి ప్రసాద్, బీసీపోగు మేరి, బీసీపోగు రవి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వర రావు, దేవరపల్లి భవాని,ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18న భక్తి సంగీత విభావరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నమయ్య కళావేదికపై శ్రీసాయిరాగ సంగీత కళాశాల ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకుని 18న శివగానాలహరి పేరుతో భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

వడ్డెర సంక్షేమ కమిటీ సభ్యుడిగా అచ్చి కిరణ్

నెహ్రూనగర్: వడ్డెర సంక్షేమ కమిటీ జిల్లా సభ్యుడిగా నగరానికి చెందిన అచ్చి కిరణ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు నూరి ఫాతిమా పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి గ్రామోత్సవం

పాత గుంటూరు: కొత్తపేట శ్రీ గణేశ్వరరావు వీధిలోని షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం దశాబ్ది వార్షికోత్సవాలలో భాగంగా గురువారం బాబా వారికి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో మేళ తాళాలు, తీన్మార్, కనక తప్పెట్లు, కోలాటాలతో పుర వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. కేవీ సాయిబాబాశర్మ, భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు. నిర్వాహకులు లక్ష్మీ నరసింహారావు పర్యవేక్షించారు.

సంగమేశ్వర క్షేత్రానికి బ్రహ్మోత్సవ శోభ

- మహాశివరాత్రికి ముస్తాబు
- అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటి
- 15న ప్రారంభమైన ఉత్సవాలు





కొత్త శోభ సంతరించుకున్న సంగమేశ్వర, వీరభద్ర, పాప వినాశేశ్వర స్వామి ఆలయాలు, గ్రామోత్సవానికి సిద్ధమవుతున్న వాహనం

సంగంజాగర్లమూడి(తెనాలిరూరల్): మహాశివరాత్రి వేడుకలకు సంగమేశ్వరస్వామి సిద్ధమయ్యాడు. సంగంజాగర్లమూడి గ్రామంలో కొలువైన బాలాత్రిపుర సుందరి సమేత సంగమేశ్వరస్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా దేవదాయశాఖ ముస్తాబు చేసింది. ఈ యేడు వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు, ఆలయ చైర్మన్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే 15న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ రోజు స్వామిని పెండ్లి కుమారునిగా చేశారు. బిందె తీర్థాన్ని గ్రామంలో ఊరేగించారు. అగ్ని ప్రతిష్టాపన, అంకురారోపణ, ధ్వజారోహణ నిర్వహించారు. గురువారం గ్రామ బలిహరణ నిర్వహించారు. స్వామిని శేష వాహనంపై ఊరేగించారు. 17న నరనంది వాహనంపై ఊరేగించనున్నారు. గ్రామ ప్రభను రథంపైకి చేర్చనున్నారు. 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయం లోపల బలిహరణ, స్వామికి లింగోద్భవ కాల అభిషేకం ప్రారంభిస్తారు. గ్రామం నుంచి భక్తులు ఇచ్చే తలంబ్రాలను ఆలయానికి తీసుకువెళతారు. మధ్యాహ్నం ఎదురుకోలు ఉత్సవం నిర్వహించి, రాత్రికి సంగమేశ్వర, పాపవినాశేశ్వర, వీరభద్ర స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తారు. 19న ఉదయం స్వామి వార్ల గ్రామోత్సవం, సాయంత్రం రథోత్సవం ఉంటాయి. 20న ఉదయం వసంతోత్సవం, స్వామి వార్ల గ్రామోత్సవం త్రిశూల స్నానం, పూర్ణాహుతి, అశ్వవాహనంపై స్వామి వార్లను ఊరేగిస్తారు. 21వ తేదీ మధ్యాహ్నం వరకు అభిషేకాలు నిర్వహించి, రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రంగులు వేయించి ముస్తాబు చేశారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

రథోత్సవం విశిష్టత

మహా శివరాత్రిని పురస్కరించుకుని సంగంజాగర్లమూడి గ్రామంలో నిర్వహించే రథోత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. ఏటా ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు తరలి వస్తారు. శివరాత్రి పండుగ నాడు రథాన్ని గ్రామంలోని రథశాల నుంచి ఆలయానికి తీసుకువస్తారు. ఆ మరుసటి రోజు ప్రభలపై స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించి, సాయంత్రానికి రథోత్సవం నిర్వహిస్తారు.

పురాతన ఆలయాల్లో ఒకటి..

సంగమేశ్వరస్వామి దేవస్థానం పురాతన ఆలయాల్లో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. ద్వాపర యుగాంతంలో అత్రి మహా ముని ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించారని చెబుతుంటారు. సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పాపవినాశేశ్వర, వీరభద్ర స్వామి, ఆంజనేయ, గంగాదేవి, శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సంగేశ్వరస్వామి కొలువుదీరారు. నవగ్రహ మండపం ఉంది. సుమారు 180 ఏళ్ల క్రితమే రాచూరు జమీందార్లు ఆలయంలో అన్నశాలను నిర్మించడంతోపాటు అర్చకుల, ఇతర సేవకులకు ఈనాములు ఇచ్చారని ప్రతీతి. వీరి వంశస్తులే ఆలయ చైర్మన్లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం రావుబహదూర్ మాణిక్యరావు సిద్ధార్థ వెంకట మార్కండేయరావు చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకుంటే కాశి, గయ, ప్రయాగ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నంత పుణ్యప్రదమన్న నమ్మకం ఉంది.

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా దేవస్థానానికి రంగులు వేయించాం. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ముఖ్యంగా రథోత్సవంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వి.పద్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేటలో నివసించే కోటా మణికంఠ(26) వ్యాపారంలో నష్టం వచ్చి మానసికంగా కృంగిపోయాడు. బుధవారం రాత్రి వంట గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. వసంతరాయపురంలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బాలిక ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయంలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఆలయంలో చోరీ ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణబాబు కాలనీలో శ్రీఅభయ గణపతి ఆలయంలో ఆలయ ధర్మకర్త నరసింహస్వామి బుధవారం రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తిరిగి ఆలయానికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయంలో హుండీ కనిపించలేదు. హుండీలోని రూ.10వేలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీఐ సామాజిక బాధ్యత

బ్యాంక్ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ



సభలో మాట్లాడుతున్న ఓం నారాయణశర్మ

బుర్రిపాలెం(తెనాలి): భారతీయ స్టేట్ బ్యాంక్ కేవలం వ్యాపార దృక్పథంతోనే పని చేయటం లేదని, సామాజిక బాధ్యతగా విస్తృత సేవలు అందిస్తోందని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ చెప్పారు. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ, రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్టేట్‌బ్యాంక్ తరఫున గురువారం ఎనిమిది కంప్యూటర్లను ఓం నారాయణ శర్మ చేతులమీదుగా బహూకరించారు. సైన్స్ ల్యాబ్‌లో ప్రయోగాలకు కావాల్సిన పరికరాలనూ పంపిణీ చేశారు. అనంతర సభలో శర్మ మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాల, కాలేజి విద్యార్థులకు అవసరమైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. కొన్ని కాలేజీల్లో విద్యార్థులు కలుషిత నీరు తాగాల్సిన అవసరం లేకుండా సురక్షిత మంచినీటి యంత్రాలను స్టేట్‌బ్యాంక్ అందజేసినట్టు వివరించారు. బ్యాంకు అందజేసిన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటారన్న ఆశాభావాన్ని ఓం నారాయణ శర్మ వ్యక్తం చేశారు. సభానంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు రూపొందించిన కళారూపాలను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ డీజీఎం దినేష్ గులాటి, రీజనల్ మేనేజర్ ఎస్ఎల్‌కేఎంవీ ప్రసాద్, చీఫ్ మేనేజరు రవీంద్రకుమార్, బుర్రిపాలెం బ్రాంచి మేనేజను శ్రీహరికాంత్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లలిత ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి పీహెచ్‌సీలో కాన్పులు చేయాలి



డాక్టర్ శ్రావణ్‌బాబును సన్మానిస్తున్న వైద్యులు, వైద్యాధికారులు

గుంటూరు మెడికల్: జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేసేందుకు ఏమైనా అవరోధాలు ఉంటే వాటిని అధిగమించేందుకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులంతా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, సీడీ- ఎన్‌సీడీ సర్వే, స్కూల్‌హెల్త్ కార్యక్రమం, ఎనీమియా ముక్త భారత్, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలపై సమీక్ష చేసి పూర్తి స్థాయిలో ప్రజలు ఆరోగ్య సేవలు వినియోగించుకునేలా చూడాలన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది, కలిసి కట్టుగా పని చేసి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలు సేవలను వినియోగించుకునేలా చూడాలని చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని డాక్టర్ శ్రావణ్‌బాబు వెల్లడించారు. ఇటీవల నూతనంగా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రావణ్‌బాబును వైద్య అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. సమీక్షలో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రత్నమన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య రూపకం



గుదిబండి వెంకటరెడ్డి, పవన్‌కుమార్‌లను సత్కరించిన సంస్థ నిర్వాహకులు

పాతగుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళా వేదికగా కళావిపంచి ఆధ్వర్యంలో గోదాకల్యాణం కూచిపూడి నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభకు కళాశాల పోషకులు నూతలపాటి తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు వల్లూరి జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకట రెడ్డి, శర్మ గ్రూప్ ఎండీ ఎర్రమల్లి పవన్ కుమార్‌లకు పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. కూచిపూడి నృత్య కార్యక్రమాన్ని అందించిన కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావును అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యుడు కథక్ అంజిబాబు, డాక్టర్ సజనీ వల్లభనేని, నాట్యరత్న రమణి సిద్ధి, డీ తిరుమలేశ్వరరావు, జీ మల్లికార్జునరావు, జీవీజీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏథర్ ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లోకి విడుదల




షోరూంను ప్రారంభించి స్కూటర్‌ను వినియోగదారుడికి అందించిన డీటీసీ కరీం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులో నూతనంగా ఏర్పాటైన పవన్ ఎలక్ట్రోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ ఏథర్ 450ఎక్స్ వాహనాన్ని రవాణాశాఖ డెప్యూటీ కమిషనర్ షేక్ కరీం ప్రారంభించి వాహనాన్ని మొదటి వినియోగదారుడికి అందించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే ద్విచక్ర వాహనాలను క్వాలిటీ ప్రధానంగా, ఒకసారి చార్జింగ్ చేస్తే ఎక్కువ దూరం ప్రయాణించే ఎలక్ట్రిక్ వాహనం ఏథర్ 450 ఎక్స్‌ను జిల్లాలోని వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చిన షోరూం యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. సంస్థ ఎండీ చుక్కపల్లి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఏథర్ 450ఎక్స్ 3.7కెవి పవర్ ఫుల్ బ్యాటరీ కెపాసిటీతో 146 కిలోమీటర్ల చార్జింగ్ రేంజ్, నాలుగు డ్రైవ్ మోడ్, గంటకు 90 కిలోమీటర్ల వేగంతో వాహనం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. 3 సెకన్లలో 40 కిలోమీటర్లు వేగం అందుకుంటుందని తెలిపారు. ఏడడుగుల టచ్ స్క్రీన్, గూగుల్ మ్యాప్ నావిగేషన్, రివర్స్‌గేర్ సౌకర్యం కలిగిఉందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గుర్రం హనుమంతరావు, షోరూం మేనేజరు అనూష పాల్గొన్నారు.

సైసైరా చిన్నపరెడ్డి

- అసమాన సాహసానికి ప్రతీక
- కోటప్పకొండ దొమ్మీకి 115 ఏళ్లు
- స్మారక స్థూపం ఏర్పాటుకు ఫలించని యత్నాలు



గాదె చిన్నపరెడ్డి ఊహాచిత్రం

తెనాలి: జాతీయోద్యమాన్ని మలుపు తిప్పిన కోటప్పకొండ దొమ్మీకి 115 ఏళ్లు. 1909లో మహాశివరాత్రి పర్వదినం రోజైన ఫిబ్రవరి 18న జరిగిన కోటప్పకొండ దొమ్మీ 'సైసైరా చిన్నపరెడ్డి' సాహసానికి ప్రతీక. రాష్ట్రంలో వందేమాతరం ఉద్యమానికి ఊపిరిలూదిందీ దొమ్మీ. దీనికి కారకుడైన చిన్నపరెడ్డిని నాటి బ్రిటిష్ పోలీసులు ఉరితీశారు. వీర మరణం పొందిన చిన్నపరెడ్డిని స్వాతంత్ర్యయోధుడిగా గుర్తించాలని, ఆయన స్మారక స్థూప నిర్మించాలని ఆయన వంశీకులతోపాటు జాతీయ భావాలు కలిగిన ఎందరో కోరుతున్నారు.

చిన్నపరెడ్డి నేపథ్యమిదీ..

తెనాలి డివిజన్‌లోని చేబ్రోలు శివారు కొత్త రెడ్డిపాలెం చిన్నపరెడ్డి స్వస్థలం. ఆయన గాదె సుబ్బారెడ్డి, లింగమ్మకు 1864లో జన్మించాడు. ఇంట్లోనే గుర్రాలు ఉండటంతో స్వారీ అలవడింది. చెన్నైలోని నీలిమందు మార్కెట్‌కు వెళుతుండేవాడు చిన్నపరెడ్డి. గుబురు మీసాలు, తలపాగాతో గుర్రంపై వెళుతుండే ఆజానుబాహుడైన చిన్నపరెడ్డి అంటే బ్రిటిష్ సైనికులకు కంటగింపు. రాజవీధుల్లో ఇతరులు స్వారీ చేయరాదనే ఆంక్షలనూ ధిక్కరించేవాడు. ఆ రోజుల్లో పన్నులు కఠినంగా ఉండేవి. కరువు రోజుల్లోనూ ధాన్యం ధర అధికంగా వసూలుచేసే బడా రైతుల వద్ద ధాన్యం కుప్పలను పేదల కోసం రాత్రికి రాత్రే నూర్పుకు తెచ్చేవాడు. న్యాయమైన ధరను అక్కడ ఉంచేవాడు. అతడి దాతృత్వానికి పేదప్రజలు అభిమానులయ్యారు.

కోటప్పకొండ దొమ్మీ ఇలా..

మహాశివరాత్రికి కోటప్పకొండ తిరునాళ్లకు 60 అడుగుల ప్రభతో వెళ్లటం చిన్నపరెడ్డికి అలవాటు. ప్రభకు ముందు గుర్రంతో సహా బయలుదేరి ఏనుగులబాట నుంచి కొండపైకి నేరుగా వెళ్లి పూజలు జరిపించి వచ్చేవాడు. అప్పుడు కోటప్పకొండ ప్రాంతం రెడ్డిరాజుల పాలనలో ఉన్నందున చిన్నపరెడ్డి ప్రభకు ముందు వరుసల్లో స్థానం కల్పించేవారు. చెన్నైలో నీలిమందు మార్కెట్‌కు వెళ్లినపుడు దగ్గర్లో జరిగిన బహిరంగసభలో ప్రకాశం పంతులు, బాల గంగాధర తిలక్ ప్రసంగాలను చిన్నపరెడ్డి విన్నాడు. వందేమాతరం నినాదాన్ని పట్టుకున్నాడు. తిరిగొచ్చాక 'మనదే రాజ్యం.. బ్రిటిష్ వారిని పారదోలండి' అంటూ దండును తయారుచేశాడు. 1907లో జిల్లా కలెక్టరు కోరినా ఉద్యమాన్ని విరమించలేదు. 1908లో కోటప్పకొండ తిరునాళ్లలో వందేమాతరం నినాదాన్ని ఉధృతం చేశాడు. మరుసటి ఏడాది 1909 ఫిబ్రవరి 18న ప్రమాదమని తెలిసినా తిరునాళ్లకు ప్రభను కట్టాడు. అయిదు లక్షల మంది జనం తరలివచ్చారు. పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దీంతో ఎడ్లు బెదిరాయి. చిన్నపరెడ్డి పోలీసులకు ఎదురుతిరిగాడు. తమను అడ్డుకున్న చిన్నపరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు పోలీసులను చితగ్గొట్టారు. పోలీస్ స్టేషను ముందున్న తాటాకు పందిరికి, సత్రానికి నిప్పుపెట్టారు. డీఎస్పీని గాయపరిచి, సబ్‌కలెక్టర్ దఫేదారును చితకబాదారు. సబ్‌కలెక్టర్, డీఎస్పీలు తప్పించుకున్నారు. ఈ దొమ్మీలో ఒక కానిస్టేబుల్, ఉప్పు శాఖ జవాను, తిరునాళ్లకు వచ్చిన ఐదుగురు మరణించారు.

ఉరికొయ్యలకు చిన్నపరెడ్డి బలి

దొమ్మీ నేపథ్యంలో చిన్నపరెడ్డి, అతడి అనుచరులు మొత్తం వందమందిపై బ్రిటిష్ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. అతి కష్టంమీద చిన్నపరెడ్డిని అరెస్టు చేశారు. గుంటూరు కోర్టులో విచారణ జరిపి అతడితో సహా 21 మందికి ఉరిశిక్ష, 24 మందికి కఠిన కారాగార శిక్ష విధించారు. చెన్నైలోని హైకోర్టుకు అప్పీలు చేశారు. అక్కడా చిన్నపరెడ్డికి ఉరిశిక్ష, 21 మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ 1910 ఆగస్టు 18న తీర్పు వెలువడింది. అదే ఏడాది అక్టోబరులో రాజమండ్రి జైలులో ఉరిశిక్ష అమలుచేశారు. తీర్పును జీర్ణించుకోలేని ప్రజలు గ్రామగ్రామాన వందేమాతరం ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఈ వీరుడి సాహసంపై 'సైసైరా చిన్నపరెడ్డీ.. నీ పేరు బంగరు కడ్డీ' అంటూ గేయాలు, బుర్రకథలు వచ్చాయి.

అప్పటి సంప్రదాయం ఏటా..

చిన్నపరెడ్డి కారణంగా కోటప్పకొండ తిరునాళ్లలో పోలీసు క్యాంపు ఏర్పాటుచేసి ఎస్పీ, కలెక్టర్ అక్కడే మకాం వేసేవారు. ఇదే ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సంప్రదాయం ఉమ్మడి రాష్ట్రంలో మరే తిరునాళ్లలోనూ లేదు. అక్కడ చిన్నపరెడ్డి ప్రభను నిలిపిన స్థలం, ఎడ్ల పందేల్లో పాల్గొన్న స్థలం ఇప్పటికీ జిల్లా పరిషత్ ఆధీనం (సర్వే నం.304)లోనే ఉంది. చిన్నపరెడ్డిని స్వాతంత్ర్య యోధుడిగా గుర్తించాలని ఆయన వంశీకులు ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా సానుకూల స్పందన రాలేదు. కోటప్పకొండ, కొత్తరెడ్డిపాలెంలో స్మారక స్థూపాల నిర్మాణం చేయాలన్న విజ్ఞప్తికి అప్పటి సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలపై రెండు ప్రదేశాల్లోనూ అధికారులు సంయుక్త పరిశీలన చేశారు. కొత్తరెడ్డిపాలెంలో 3 సెంట్ల స్థలంలో నిర్మాణానికి అనుమతులిచ్చారు. గత పద్నాలుగేళ్లుగా ఆ ప్రతిపాదనలు కాగితాలపైనే ఉండిపోయాయి.

ప్రభుత్వం స్పందిస్తుందని భావిస్తున్నాం



చిన్నపరెడ్డి సాహసం, కోటప్పకొండ ఘటన ఆనాటి స్వరాజ్య ఉద్యమానికి ఒక స్ఫూర్తిగా ప్రముఖులెందరో పేర్కొన్నా, ఆయన్ను స్వాతంత్ర్యయోధుడిగా గుర్తించకపోవటం విచారకరం. చిన్నపరెడ్డి స్మారక స్థూపం ప్రతిపాదన అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నాం.

– గాదె వెంకట సుబ్బారెడ్డి, చిన్నపరెడ్డి వంశీకుడు

నిషేధిత ప్రాంతంలో అర్ధరాత్రి అక్రమ క్వారీయింగ్

పోలీసు, రెవెన్యూ అధికారులకు స్థానికుల ఫిర్యాదు



అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురంలో ఇరువర్గాల మధ్య వివాదాస్పదంగా మారిన నిషేధించిన ప్రాంతంలో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ క్వారీయింగ్ నడుస్తోంది. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు రాత్రి సమయాల్లో జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో కొండ పోరంబోకు ప్రాంతంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ కొండపై నిర్మించిన ఇరువర్గాలకు చెందిన ఆలయాల నిర్మాణం వ్యవహారం ఇప్పటికే వివాదాస్పదంగా మారింది. దీంతో ఎవరినీ ఈ ప్రాంతంలో నిర్మాణాలు గానీ, కార్యకలాపాలు గానీ నిర్వహించవద్దని రెవెన్యూ, పోలీసు అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోల స్వయం పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకుంటామని, అప్పటి వరకు సంయమనం పాటించాలని సూచించిన నేపథ్యంలో ప్రస్తుతం ఈ ప్రాంతంలో నిషేధం కొనసాగుతోంది. కానీ అర్ధరాత్రి కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు జేసీబీ, ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. సంబంధిత వ్యక్తులపై చర్యల నిమిత్తం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడేపల్లి రూరల్ : ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌టీఆర్ జిల్లా నందిగామకు చెందిన అచ్చి మల్లయ్య, భార్య మంగమ్మ (47) ఈనెల 14న చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. నులకపేట తహసీల్దార్ కార్యాలయం దగ్గర మద్యం మత్తులో ఉన్న కాకుమాను భాగ్యేశ్వరరావు ద్విచక్ర వాహనంతో మల్లయ్య, మంగమ్మ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మంగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

బీసీ జనభేరి పోస్టర్ ఆవిష్కరణ

నెహ్రూనగర్(గుంటూరు): బీసీ జనభేరి పోస్టర్‌ను స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సేన జిల్లా అధ్యక్షులు గోలి నాగకుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ బీసీ సేన ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో బీసీల హక్కుల కోసం హక్కుల సాధన కోసం బీసీ జనభేరి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మల్లికార్జున రావు, ఆంజనేయులు, కుంచాల కిషోర్, విజయలక్ష్మి, వేముల రాము, మణికంఠ, ప్రతాప్ రాజు, తురక రామారావు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్(గుంటూరు): నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనలు, కార్పొరేషన్‌కు సంబంధించిన అంశాలతో కలిపి మొత్తం 185 అంశాలపై చర్చ నిర్వహించనున్నట్లు చెప్పారు.